నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్‌: విద్యుత్‌ ఫీడర్‌ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రగతినగర్‌ ఏఈ జ్ఞానేశ్వర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ డాక్టర్స్‌ కాలనీ కేబుల్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 గంటల నుండి 11:30 గంటల వరకు నిజాంపేట్‌ కార్పొరేషన్‌ కార్యాలయం, జుడో మాల్‌, 60 ఫీట్‌ రోడ్డు, 11కేవీ ప్రగతినగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రగతి సెంట్రల్‌ స్కూల్‌ ఏరియా, త్రీమంకీస్‌ చౌరస్తా, ఎన్టీఆర్‌ పార్క్‌ ప్రాంతాలు, 11కేవీ ఆర్‌కేజీకే ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 3 గంటల వరకు వాసవీ లేఅవుట్‌, న్యూ విజేత సూపర్‌ మార్కెట్‌, ఆర్‌కేజీ రోడ్డు, 11కేవీ మధురా నగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4:30 గంటల వరకు మోర్‌ సూపర్‌ మార్కెట్‌, అంబ భవానీ హోటల్‌, డాక్టర్స్‌ కాలనీ ఏరియా, 11కేవీ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయికృష్ణ కాలనీ, లహరీ గ్రీన్‌ పార్క్‌, ఇందిరమ్మ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

కుత్బుల్లాపూర్‌: విద్యుత్‌ఫీడర్‌ లైన్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్‌ సెక్షన్‌ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ప్రాగా టూల్స్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 3 గంటల వరకు ప్రాగా టూల్స్‌ కాలనీ, బీహెచ్‌ఈఎల్‌ విస్టా, హార్టికల్చర్‌ కార్యాలయ ప్రాంతం, ఎన్‌సీఎల్‌ గోదావరి, శాంతాశ్రీరామ్‌, జీఎల్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌, లక్ష్మీ గంగా ఎన్‌క్లేవ్‌, 11కేవీ పైపులైన్‌ రోడ్డు ఫీడర్‌ పరిధిలో ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పైపులైన్‌ రోడ్డు, శ్వేత ఆర్యన్‌, ఆరెమ్స్‌బర్గ్‌ అపార్ట్‌మెంట్స్‌, ఆర్‌పీ నిర్మాణ్‌, జేడ్‌ఆర్‌ అపార్ట్‌మెంట్స్‌, సీఎంఆర్‌ స్కూల్‌, 11కేవీ సెయింట్‌ ఆన్స్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10:30 గంటల నుంచి 11 గంటల వరకు సెయింట్‌ ఆన్స్‌ స్కూల్‌, పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌, డీమార్ట్‌, పరమితా ఆసుపత్రి, ఎన్‌సీఎల్‌ కాలనీ, 11కేవీ మీనాక్షి ఫీడర్‌ పరిధిలో మీనాక్షి కాలనీ, స్ప్రింగ్‌ ఫీల్డ్‌ కాలనీ, గ్రీన్‌ పార్క్‌, జీడిమెట్ల గ్రామం ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

‘పది’లో ‘వంద’ లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులకు ‘ప్రత్యేక’ తరగతులు
- ఇళ్ల వద్ద విద్యార్థులు చదివేలా ఉపాధ్యాయులతో మానిటరింగ్‌పై కసరత్తు
- 108 ప్రభుత్వ పాఠశాలల్లో 8 వేల మంది విద్యార్థులు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ బడులపై మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ స్పెషల్‌ ఫోకస్‌ పెడుతోంది. కార్పొరేట్‌, ప్రైవేట్‌ పాఠశాలలతో పోటీ పడే విధంగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే అక్టోబర్‌ నుంచి 108 ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 8 వేల మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో సాయంత్రం వేళల్లో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక తరగతులు కొనసాగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రత్యేక తరగతుల నిర్వాహణ కార్యక్రమాన్ని 3 ఏళ్లుగా నిర్వహించటం ద్వారా జిల్లా విద్యాశాఖ మంచి గుర్తింపును సాధించింది. అలాగే, గత బీఆర్‌ఎస్‌ హయాంలో ప్రభుత్వ బడుల్లో మన బడి–మన ఊరు–మన బస్తీ పథకం కింద 176 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించగా, అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద కాంగ్రెస్‌ ప్రభుత్వం సంబంధిత అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా 286 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.12.01 కోట్లతో 699 మరమ్మతులు తదితర అభివృద్ధి పనులను చేపట్టింది. అలాగే, ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్‌ మహమ్మారి విద్యాసంస్థలపై పెను ప్రభావాన్ని చూపగా, ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి విద్యార్థులను గట్టెక్కించటానికి విద్యాశాఖ ‘మేడ్చల్‌ బడి’ యాప్‌ ద్వారా ఆన్‌లైన్‌ తరగతులను నిర్వహించి తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి మన్ననలను అందుకుంది. పుస్తక పఠనం పేరుతో రీడింగ్‌ క్యాంపెయిన్‌ నిర్వహించింది. బాలికా సాధికారత కోసం పాఠశాలల్లో కమిటీ(క్లబ్‌)లు, టూరిజం ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకునేలా సర్కారు బడుల్లో పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో అనేక కార్యక్రమాలకు జిల్లా విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల విద్య కొనసాగుతుండటంతోపాటు ఉచిత పాఠ్య, నోట్‌ పుస్తకాలు, డ్రెస్సుల సరఫరా వంటి కార్యక్రమాల నేపథ్యంలో విద్యాశాఖ చేపట్టిన బడి బాట కార్యక్రమానికి భారీగా స్పందన లభిస్తోంది. కరోనా మహమ్మారి నేర్పిన గుణపాఠంతో మూడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో 3 వేల నుంచి 4 వేల విద్యార్థులు చేరటం, ముఖ్యంగా ప్రైవేట్‌ పాఠశాలల నుంచి వచ్చి మరీ ప్రభుత్వ బడుల్లో చేరారు. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ఏ జిల్లాలో లేని విధంగా 515 ప్రభుత్వ పాఠశాలల్లో 1.07 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ–2024లో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే విద్యాశాఖ మరింత పట్టుదలతో విద్యా ప్రమాణాల మెరుగుతో పాటు పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది.



ప్రత్యేక తరగతులపై ఫోకస్‌

మార్చిలో జరిగే పదో తరగతి కామన్‌ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు స్పెషల్‌ క్లాసులు నిర్వహించటంతోపాటు చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల వారిగా తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు, విద్యాధికారులు దశల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల, పాఠశాల స్థాయిల్లో విద్యాధికారులు, ఉపాధ్యాయులతో సమీక్షలు నిర్వహించిన జిల్లా విద్యాశాఖ సిలబస్‌ రివిజన్‌ చేసే ప్రక్రియకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అలాగే, ఈ నెల నుంచి జిల్లాలో 108 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయా బడుల్లో ప్రత్యేక క్లాసులను నిర్వహిస్తోంది.

వెనుకబడిన సబ్జెక్టుల్లో స్పెషల్‌ క్లాసులు

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో గతంలో పదో తరగతి విద్యార్థుల్లో ఎక్కువగా ఫెయిల్‌ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారానికి 12 పిరియడ్స్‌ బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో 4 పిరియడ్స్‌ గణితం, 5 పిరియడ్స్‌ సామాన్య శాస్త్రం, 3 పిరియడ్లు సాంఘీక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు బోధించే విధంగా కసరత్తు చేస్తోంది.అలాగే, పదో తరగతి విద్యార్థులను వచ్చే ఫిబ్రవరి నుంచి ప్రతి రోజు ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్ర లేపేందుకు ప్రత్యేక తరహాలో ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పని తీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ కార్యాచరణ ప్రణాళిక ఖరారుతో ముందుకు సాగుతోంది.



టెన్త్‌ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



సబ్జెక్టుల వారీగా చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. వారికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. గతంలో తక్కువగా వచ్చిన ప్రైవేట్‌ స్కూళ్లపై కూడా దృష్టి సారిస్తున్నాం. వంద శాతం విద్యార్థుల ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేకంగా నోట్స్‌ తయారు చేసి అందజేస్తున్నాం. – విజయకుమారి, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా డీఈఓ

కాంగ్రెస్‌ లేబర్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి



నియామక పత్రాన్ని అందుకుంటున్న కందాడి సుదర్శన్‌రెడ్డి

కుత్బుల్లాపూర్‌: కొంపల్లికి చెందిన కాంగ్రెస్‌ నేత కందాడి సుదర్శన్‌ రెడ్డి కాంగ్రెస్‌ లేబర్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. శుక్రవారం గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ లేబర్‌ సెల్‌ చైర్మన్‌ ప్రకాష్‌గౌడ్‌ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. జిల్లా పరిధిలో అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

కుంగిన మ్యాన్‌హోళ్లు.. పట్టించుకోని అధికారులు



గణేష్‌నగర్‌లో కుంగిన మ్యాన్‌హోల్‌ను చూపుతున్న స్థానికులు

సుభాష్‌నగర్‌: అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్‌ ఇష్టారాజ్యంతో లక్షలు పెట్టి చేపట్టిన అభివృద్ధి పనులు మున్నాళ్ల ముచ్చటగా మారాయి. దుండిగల్‌ మున్సిపల్‌ బహదూర్‌పల్లిలోని 14వ వార్డు గణేష్‌ నగర్‌ కాలనీ ప్రధాన రోడ్డు నుంచి ఉదయగిరి కాలనీని కలిపే ప్రధాన రోడ్డును 3 నెలల క్రితం రూ.18 లక్షల వ్యయంతో 300 మీటర్ల మేరా నిర్మించారు మూడు నెలలు కాకముందే ఆ రోడ్డులో పది మ్యాన్‌హోళ్లు కుంగిపోయాయి. సీసీ రోడ్డు కూడా నాసిరకంతో నిర్మించారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత



పూజలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి

సుభాష్‌నగర్‌: ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్‌ అంబేడ్కర్‌ నగర్‌లోని ధామ దీప్‌ బుద్ద విహార్‌లో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్‌ సంతోష్‌ బాన్సువాడే, వైస్‌ ప్రెసిడెంట్‌ దండేరాజు, కమిటీ సభ్యులు అనిల్‌, రమేష్‌, సునీల్‌, గణేష్‌, రాము, సంతోష్‌, సంజయ్‌, శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?



ఆయుష్‌ వనం పార్కు వద్ద దెబ్బతిన్న రోడ్డు



బహదూర్‌పల్లి షైమార్క్‌ పరిశ్రమ వద్ద..

- గుంతలమయంగా రహదారులు
- మరమ్మతులకు నోచుకోని వైనం

సుభాష్‌నగర్‌: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా గోతులు ఏర్పడ్డాయి. నెలలు గడుస్తున్న పట్టించుకునే వారే కరువయ్యారు. బహదూర్‌పల్లి నుంచి కొంపల్లి వెళ్లే ప్రధాన రోడ్డులో ఈ సమస్యతో తిప్పలు తప్పడం లేదు. బహదూర్‌పల్లిలోని ఆయుష్‌ వనం పార్కు, షైమార్క్‌ వద్ద భారీ గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పదుల సంఖ్యలో ఇంజనీరింగ్‌ కళాశాలలు, ఇంటర్నేషనల్‌ కంపెనీలు ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. రోడ్డుపై పడ్డ భారీ గుంతలతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. రాత్రి సమయంలో గమనించని ద్విచక్ర వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా తక్షణమే అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

గ్రూపు- 3 పరీక్షకు 118 కేంద్రాలు

సాక్షి,సిటీబ్యూరో: నవంబరు 17, 18 తేదీల్లో తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహించనున్న గ్రూప్‌–3 పరీక్షకు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 118 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని డీఆర్‌ఓ హరిప్రియ తెలిపారు. శుక్రవారం సచివాలయం నుంచి తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహిస్తున్న గ్రూప్‌– 2,3 పరీక్షలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, టీజీపీఎస్‌సీ చైర్మన్‌ మహేందర్‌ రెడ్డి, సభ్యులు కలెక్టర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ పలు విషయాలను పేర్కొన్నారు. జిల్లాలో 71,356 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు డీఆర్‌ఓ తెలిపారు. తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిబంధనల మేరకు జిల్లాలో 7 స్ట్రాంగ్‌ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

వ్యర్థాలు పోయకుండా చర్యలు తీసుకోవాలి



శ్రీరామ్‌నగర్‌లో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌

కుత్బుల్లాపూర్‌: ఖాళీ ప్రదేశాల్లో కంపెనీల వ్యర్థాలను పోయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. శుక్రవారం హెచ్‌ఎంటీ ఖాళీ స్థలాన్ని ఆనుకుని ఉన్న శ్రీరామ్‌నగర్‌, సుభాష్‌ చంద్రబోస్‌ నగర్‌లలో ఆయన పర్యటించారు. కొన్ని పరిశ్రమల నుంచి వ్యర్థాలను తీసుకువచ్చి పారబోస్తున్నారని, అంతే కాకుండా నిప్పటించడంతో ఘాటైన వాసనలతో ఉక్కిరిబిక్కిరవుతున్నామని స్థానికులు శ్రీశైలంగౌడ్‌ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. హెచ్‌ఎంటీ స్థలానికి ఆనుకుని ఉన్న పోచమ్మ ఆలయ మార్గాన్ని మూసి వేయాలని, వ్యర్థాలను పారబోస్తున్న పరిశ్రమలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట నవ యుగ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ జహంగీర్‌, ప్రెసిడెంట్‌ బలరాం, కాంగ్రెస్‌ నాయకులు బుచ్చిరెడ్డి, పద్మ, మధు, అశోక్‌ తదితరులు ఉన్నారు.

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులేవి?



చెరకుపల్లి కాలనీ రోడ్డులో శిథిలమైన మ్యాన్‌హోల్‌



షాపూర్‌నగర్‌ డీసీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న మార్కెట్‌ రోడ్డులో..

రంగారెడ్డినగర్‌: ప్రధాన రోడ్లపై శిథిలమైన భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు, డ్రెయిన్‌ మూతలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నిర్మాణంలో నాసిరకంగా మూతలను ఏర్పాటు చేయడంతో వాటిపై నుంచి వాహనాలు వెళ్లే క్రమంలో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటి నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల మూతలు విరిగి వాటి ఇనుప చువ్వలు బయటకు రావడంతో వాహనాల టైర్లు పంక్చర్‌ అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న షాపూర్‌నగర్‌ మార్కెట్‌ రోడ్డులో మ్యాన్‌హోల్‌, చెరుకుపల్లి కాలనీ నుంచి చింతల్‌కు వచ్చే మార్గంలో మ్యాన్‌హోల్‌ శిథిలమై నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అదే విధంగా చింతల్‌ మార్కెట్‌ ప్రధాన రోడ్డులోని డ్రెయిన్‌ మూత పగిలిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌ మూతలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పోలీసుల కస్టడీకి పద్మజారెడ్డి

- పలు విషయాలపై పోలీసుల విచారణ
- అశోక్‌ అనే వ్యక్తి సహకారంతోనే నకిలీ పత్రాలు తయారు చేయించినట్లు వెల్లడి

జీడిమెట్ల: నకిలీ పత్రాలతో ఓ స్థలాన్ని రిజిస్ట్రేషన్‌ చేయించుకున్న కేసులో రిమాండులో ఉన్న పద్మజారెడ్డిని జీడిమెట్ల పోలీసులు ఒక్క రోజు కస్టడికీ తీసుకున్నారు. సుభాష్‌నగర్‌లోని 200 గజాల ఖాళీ స్థలాన్ని కొంద మంది వ్యక్తులతో కలిసి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసింది. అ తర్వాత స్థల యజమాని మృతి చెందినట్లు నకిలీ మరణ పత్రాలు తయారు చేయించింది. స్థల యజమాని ఫిర్యాదుతో నకిలీ పత్రాల బాగోతం వెలుగులోకి రావడంతో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈనెల 4వ తేదీన బాలానగర్‌ డీసీసీ ఆమెతో పాటు మరో ఐదుగురిని రిమాండుకు తరలించారు. కాగా రిమాండులో ఉన్న పద్మజారెడ్డిని జీడిమెట్ల పోలీసులు శుక్రవారం కోర్టు అనుమతితో ఒక్క రోజు కస్టడీకి తీసుకుని విచారించారు. విచారణలో భాగంగా ఆమె కొన్ని విషయాలను పోలీసులకు తెలిపింది. అందులో గచ్చిబౌలిలో తనకు పరిచయమైన అశోక్‌ అనే వ్యక్తి సహకారంతోనే నకిలీ పత్రాలను తయారు చేసినట్లు విచారణలో తెలిపింది. అంతేకాకుండా రాధాకృష్ణ అనే వ్యక్తి పేరు కూడా తెరమీదకు వచ్చింది. పరారీలో ఉన్న అశోక్‌ పోలీసులకు దొరికితే మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు.

సీఎంపై విమర్శలు మానుకోవాలి

చింతల్‌: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్‌ నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్‌ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్‌ సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్య పదజాలం వాడటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి ప్రజల మద్దతును చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

6 నెలల్లో.. ఎకరాలు మాయం!

మల్లంపేట్‌ సర్వే నెంబర్‌ 170లో అక్రమ నిర్మాణాలు
అధికారుల అండ కబ్జాదారులకే!
అప్పుడప్పుడు కూల్చివేతలు

మల్లంపేట్‌ ప్రాంతంలో భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఒక వైపు ప్రభుత్వ స్థలాలు, మరొకవైపు అసైన్డ్‌ భూములను ఆక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్లాట్లుగా మార్చి గజాలను లక్షల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న దుండిగల్‌ రెవెన్యూ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది.



మల్లంపేటలో కొనసాగుతున్న ఓ అక్రమ నిర్మాణం

కుత్బుల్లాపూర్‌ : నియోజక వర్గ పరిధిలోని దుండిగల్‌ మండలం మల్లంపేట్‌లో సర్వే నెంబర్‌ 170లో సుమారు 6 ఎకరాల అసైన్డ్‌ స్థలం ఉంది. ఆరు నెలల కాలంలోనే ఆరు ఎకరాల స్థలం కబ్జాకు గురైంది. 60 గజాల స్థలాన్ని రూ. 8 లక్షలకు, 80 గజాలను రూ.10 లక్షల చొప్పున ప్లాటుగా చేసి అమ్మకాలను ప్రారంభించారు. ఇక్కడ పని చేస్తున్న రెవెన్యూ అధికారులు వారితో చేతులు కలిపి స్థలాలను స్వాహా చేయడమే పనిగా పెట్టుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆ ఇద్దరి పై ఆరోపణలు

మల్లంపేట్‌ ప్రాంతంలో భూకబ్జాలు జరుగుతున్న విషయంపై సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. జాకీర్‌ అనే వ్యక్తి, ఆంజనేయులు అనే మేస్త్రి ఇందుకు బాధ్యులుగా గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిసింది. ఇప్పటి వరకు వీరిపై ఎలాంటి కేసులు నమోదు కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ‘దొంగలను దోచుకోమని.. పోలీసులను పట్టుకోమని’ అన్నట్టుగా రెవెన్యూ అధికారుల తీరు ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు.

నెల రోజులుగా అక్కడక్కడ కూల్చివేతలు

గతంలో మల్లంపేట్‌ సర్వే నెంబర్‌ 170 జరిగిన అక్రమ నిర్మాణాలను అడ్డుకో లేకపోయిన రెవెన్యూ అధికారులు తాజాగా బాధ్యతలు చేపట్టిన రెవెన్యూ అధికారి రవికుమార్‌ గడిచిన నెల రోజుల్లో 10 నిర్మాణాలను కూల్చివేశారు. అసైండ్‌ స్థలంలో తాజాగా ఓ వ్యక్తి బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్న అధికారులు అటు వైపు వెళ్లలేదని స్థానికులు పేర్కొన్నారు. స్థానికంగా ఉండే ఓ నాయకుని ఒత్తిడితో అధికారులు ఆ నిర్మాణాన్ని కూల్చివేయడం లేదని ప్రధాన ఆరోపణ. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా హైడ్రా అధికారులు ఇటీవల ఓ బడా వెంచర్‌ నిర్మాణాలను ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్‌ ప్రాంతాల్లో కూల్చివేతలు చేపట్టారు. ఈ కుల్చివేతలకు కూత వేటు దూరంలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుండడంతో రెవెన్యూ అధికారుల పని తీరుపై విమర్శలు వస్తున్నాయి.

కూల్చివేతలు చేపడతాం

మల్లంపేట్‌ సర్వేనెంబర్‌ 170 లో నెల రోజుల వ్యవధిలో పలు నిర్మాణాలను కూల్చివేశాము. తాజాగా జరుగుతున్న నిర్మాణాలను గుర్తించి తొలగిస్తాం. ఇప్పటికే భూకబ్జాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి ఉన్నత అధికారులకు నివేదిక అందజేశాం. త్వరలోనే వారిపై పోలీసు కేసులు కూడా నమోదు చేస్తాం.
– రవికుమార్‌, రెవెన్యూ అధికారి దుండిగల్‌

చెకుముకి సంబరాలు – 2024ను విజయవంతం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా





పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయకుమారి, అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా తదితరులు

సాక్షి,సిటీబ్యూరో: చెకుముకి సైన్స్‌ సంబరాల్లో విద్యార్థులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జన విజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు–2024 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి మాట్లాడుతూ.. బాల్యదశ నుంచే విద్యార్థుల్లో మూఢ నమ్మకాలను తొలగించి, సైన్స్‌ పట్ల ఆసక్తి కలిగించడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్‌ టెస్టులు, విద్యార్థి దశలో ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. జన విజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్‌ బి.ఎస్‌.రెడ్డి మాట్లాడుతూ.. నవంబర్‌ 7న పాఠశాల స్థాయిలో, నవంబర్‌ 21న మండల స్థాయిలో, నవంబర్‌ 28న జిల్లా స్థాయిలో, డిసెంబర్‌ 14,15,16 తేదీలలో ఆదిలాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో చెకుముకి సైన్స్‌ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.